# సాక్షి మహబూబాబాద్

సోమవారం | 5 | ఆగస్టు | 2024






## శాశ్వత పనులకు ప్రణాళిక రూపొందించాలి

మేడారంలో శాశ్వత అభివృద్ధి పనుల అంచనా ప్రణాళికలను సిద్ధం చేయాలని మంత్రి దనసరి సీతక్క అధికారులను ఆదేశించారు. - 8లో▸



## ఆలోచిస్తూ ముందుకు 'సాగు'

పత్తి, వరి, మొక్కజొన్న పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వరంగల్ జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్ రైతులకు సూచించారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం

31⁰/20⁰

## వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. పలు చోట్ల వర్షం కురిసే అవకాశం ఉంటుంది.

## న్యూస్‌రీల్

### మహిళలంటే ముఖ్యమంత్రికి చిన్నచూపు

**మాజీమంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్**

**డోర్నకల్:** సీఎం రేవంత్‌రెడ్డికి మహిళలంటే చిన్నచూపని, అసెంబ్లీ వేదికగా మహిళలను అవమానపర్చేవిధంగా మాట్లాడుతున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ అన్నారు. ఆదివారం డోర్నకల్‌లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాలు మాట్లాడేందుకు అసెంబ్లీని వేదికగా వాడుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు భ్రమలు తొలగుతున్నాయని, హామీల అమలుపై నాన్చుడు ధోరణి అవలంబిస్తుండడంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు. మహబూబాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్ తల్లి నాగమ్మ ఇటీవల మరణించగా సత్యవతిరాథోడ్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు మన్యుపాట్ని, బోరగళ్ల శరత్, యశోధర్‌జైన్, కొత్త వీరన్న, భూక్య వీరన్న, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

### గంధంపల్లిలో డీసీఎం బీభత్సం

**ఆటో, తోపుడు బండిని ఢీకొట్టిన వ్యాన్**

**బయ్యారం:** మండలంలోని ఇల్లెందు–మహబూబాబాద్ ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి అతివేగంతో వెళ్తున్న డీసీఎం వ్యాను బీభత్సం సృష్టించింది. వివరాలు ఇలా ఉన్నాయి. అతివేగంతో ఇల్లెందు నుంచి మహబూబాబాద్ వెళ్తున్న డీసీఎం వ్యాను గంధంపల్లి ఎస్‌బీఐ ఎదురుగా రహదారి పక్కన నిలిచి ఉన్న ఆటోతో పాటు తోపుడుబండిని ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆటోలో ఉన్న మండలంలోని బండ్లకుంటకు చెందిన పాయం సాయితో పాటు మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో సాయి పరిస్థితి విషయంగా ఉండడంతో చికిత్స నిమిత్తం మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా ప్రమాదానికి కారణమైన డీసీఎంతో డ్రైవర్ సంఘటన స్థలం నుంచి పరారయ్యాడు.

### నేడు సహృదయ సాహిత్య పురస్కార ప్రదానం

**హన్మకొండ కల్చరల్ :** వరంగల్ సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ కవి, రచయిత మెట్టు మురళీధర్‌కు ఒద్దిరాజు సోదరకవుల స్మారకంగా సోమవారం సహృదయ సాహిత్య పురస్కార ప్రదానం చేస్తున్నారు. ఈ మేరకు సహృదయ సాహిత్య సంస్థ అధ్యక్షుడు గన్నమరాజు గిరిజామనోహరబాబు ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు హనుమకొండ వడ్డేపల్లిరోడ్‌లోని పీఆర్‌రెడ్డి భవన్‌లో జరిగే కార్యక్రమంలో సాహితీవేత్తలు పాల్గొనాలని కోరారు.


### శ్రావణం.. శుభప్రదం

**హన్మకొండ కల్చరల్ :** శ్రావణం.. శుభప్రదం. ఈ నెలలో చేపట్టే ప్రతీ శుభకార్యం సిద్ధిస్తుంది. చెట్టు, పుట్ట, ఆలయం.. ఇలా ప్రతీ చోట ఆధ్యాత్మిక పరిమళాలే గుబాళిస్తాయి. ఇంత పరమపవిత్రమైన ఈ మాసం సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా క్రోధి నామ సంవత్సరం శ్రావణ శుద్ధ పాడ్యమి సోమవారం నుంచి శ్రావణ బహుళ అమావాస్య సెప్టెంబర్ 3 మంగళవారం వరకు జిల్లాలోని 732 దేవాలయాల్లో శ్రావణమాసోత్సవాలు జరుగనున్నాయి.

**శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలు..**

శ్రావణ మాసంలో సోమ, మంగళ, శుక్ర, శనివారాలను పవిత్రమైనవిగా భావించి ఈ రోజుల్లో నిష్టగా ఉంటారు. శ్రావణమాసంలోనే పోచమ్మ, మైసమ్మ తదితర స్త్రీ దేవతలకు, ఆది, బుధవారాలలో బోనాలు జరుపుకుంటారు. శ్రావణ సోమవారం శివుడికి ప్రీతికరమైన రోజు. అలాగే, శనివారం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాలలో భక్తులు ప్రత్యేకపూజలు నిర్వహిస్తారు. మంగళవారం మంగళగౌరి వ్రతాలు, గురువారం సాయిబాబా ఆలయాల్లో అఖండ సాయినామయజ్ఞాలు జరుగుతాయి. అలాగే శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలు జరుపుకుంటారు.

### లక్నవరంలో పర్యాటకుల సందడి



**గోవిందరావుపేట :** మండలంలోని లక్నవరం సరస్సుకు పర్యాటకులు పోటెత్తారు. ఆదివారం సెలవుతోపాటు స్నేహితుల దినోత్సవం కావడంతో సందర్శకులు లక్నవరం చెరువు వద్దకు చేరుకొని రోప్(వేలాడే) వంతెనపై సెల్ఫీ దిగుతూ సందడి చేశారు. అధిక సంఖ్యలో సందర్శకులు తరలిరావడంతో లక్నవరం పర్యాటక కేంద్రం మేనేజర్ శంకర్ సందర్శకులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. సరస్సులో నీరు సమృద్ధిగా ఉండడంతో పర్యాటకులు బోటు షికారుతో ఎంజాయ్ చేశారు.

# ఏకలవ్యలో నీటి కష్టాలు..



నామాలపాడు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్

బాత్‌రూం అవసరాలకు ట్యాంకర్ నీరు తెచ్చుకుంటున్న విద్యార్థి

**పాఠశాలలో నీటి వసతి లేక విద్యార్థుల అవస్థలు**

- నాణ్యమైన ఆహారం అందడంలేదని ఆరోపణ
- పట్టించుకోని ఉన్నతాధికారులు

**బయ్యారం:** జిల్లాలోని బయ్యారం మండలం పరిధి నామాలపాడులోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు కష్టాల నడుమ చదువుకోవాల్సి వస్తోంది. సుమారు రూ.32 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన పాఠశాలలో సంవత్సరం క్రితం తరగతులు ప్రారంభించారు. 6నుంచి 10వ తరగతి వరకు పాఠశాల విద్యతో ఇంటర్ విద్యార్థులకు బోధిస్తున్నారు. కాగా కొత్తగూడ ఏకలవ్య ఇంటర్ విద్యార్థులతో మొత్తంగా 390మంది ప్రస్తుతం పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. వీరికి సరిపడా వసతులు ఉన్నప్పటికీ నీటి సౌకర్యం లేకపోవడంతో తిప్పలు తప్పడం లేదు.



ట్యాంకర్ నీటితో భోజన ప్లేట్లను కడుగుతున్న విద్యార్థినులు

**ఆహార నాణ్యతపై విద్యార్థుల ఆవేదన..**

పాఠశాలలో తమకు పెడుతున్న ఆహారం నాణ్యతగా ఉండడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్నం సరిగా ఉడకడం లేదని కూరలు సరిగా చేయడం లేదని విద్యార్థులు పేర్కొంటున్నారు. సుదూర ప్రాంతాల నుంచి పాఠశాలపై నమ్మకంతో చదువుకొనేందుకు వచ్చిన విద్యార్థుల కష్టాలను తొలగించేందుకు అధికారులు తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. కాగా పాఠశాలలో నీటి, భోజన సమస్యపై విద్యార్థులు ఆందోళన నిర్వహించగా పాఠశాల నిర్వాహకులు బయటకు పొక్కకుండా జాగ్రత పడడం కొసమెరుపు.

**భగీరథ నీరు రాకుంటే అవస్థలే..**

ఏకలవ్య పాఠశాలలో బోరు, బావి వసతి అందుబాటులో లేదు. దీంతో పాఠశాల ఆవరణలో ఉన్న ట్యాంక్‌కు భగీరథ నీటిని ఎక్కించి విద్యార్థులు అవసరాలకు వాడుకుంటున్నారు. భగీరథ పథకంలో సమస్యలు వచ్చి నీరు రాని సమయంలో విద్యార్థుల పరిస్థితి అమగ్యగోచరంగా మారుతోంది.. అత్యవసరాలకు వెళ్లాలన్న.. స్నానం చేయాలన్న నీరు అందుబాటులో ఉండని పరిస్థితి. తాగునీటిని వాటర్‌ప్లాంట్ ద్వారా పాఠశాల నిర్వాహకులు తెప్పిస్తున్నప్పటికీ ఇతర అవసరాల కోసం విద్యార్థులు అల్లాడుతున్నారు. గ్రామపంచాయతీకి చెందిన ట్యాంకర్ ద్వారా అప్పుడప్పుడు నీరు తెప్పిస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో అందడం లేదని విద్యార్థులు వాపోతున్నారు.

**రాత్రిపూట భయమేస్తోంది**



నీళ్లు సరిగా లేకపోవడంతో రాత్రి ఒకటి, రెండు వచ్చినా బయటకు వెళ్లి నీళ్లు తీసుకు రావాలంటే భయమేస్తోంది. ఒక్కోరోజు నీళ్లు లేవని భోజనం ఆలస్యంగా పెడుతున్నారు. మాకు నీటి ఇబ్బంది లేకుండా చూడాలి.

**- గౌతమ్, 8వ తరగతి**

# తల్లిపాలు.. అమృతం



**తల్లిపాలతో బిడ్డకు పోషకాలు**

- పాలిస్తేనే తల్లులకు మేలు
- కొనసాగుతున్న తల్లిపాల వారోత్సవాలు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు

**నెహ్రూసెంటర్:** తల్లిపాలు అమృతంతో సమానం. తల్లిపాలతో బిడ్డకు శ్రీరామరక్ష. పాలివ్వడం ద్వారా బిడ్డతో పాటు తల్లికి ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. తల్లిబిడ్డల ఆరోగ్యం కోసం ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను రూపొందిస్తున్నాయి. దీనిలో భాగంగా ఈ నెల 1నుంచి 7వతేదీ వరకు తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. కార్యక్రమాల ద్వారా తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్నారు.

**రోగనిరోధక శక్తి..**

తల్లిపాలతోనే బిడ్డకు అన్ని రకాల పోషకాలు అందుతాయని, రోగనిరోధక శక్తి పెరుగుతుందని, పిల్లలు బలంగా, శిశువు పూర్తి ఆరోగ్యంగా ఉంటారని వైద్యశాఖ అధికారులు, వైద్యులు వివరిస్తున్నారు. అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలను తాగించడం వల్ల తల్లికి, బిడ్డకు ఎన్నో లాభాలు, ప్రయోజనాలు చేకూరుతాయి. ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో తల్లిపాల ప్రాముఖ్యత, బిడ్డకు ఎన్నిమార్లు పాలు తాగించాలని, తల్లికి పాలు పడాలంటే ఏం చేయాలనే విషయాలపై సరైన అవగాహన ఉండడం లేదు. దీంతో తల్లిపాల విశిష్టతపై ఏడు రోజుల పాటు వారోత్సవాలు నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నారు.

**జిల్లాలో..**

జిల్లాలో 2023–24 ఏడాదిలో 12,690 మంది గర్భిణులు నమోదు కాగా 10,059 మంది ప్రసవించారు. పోషకాహార లోపం, రక్తహీనత, ఇతర కారణలతో ఈ ఏడాది మాతృ మరణాలు 2, శిశుమరణాలు 18 జరిగాయి. గతేడాది 110 శిశు మరణాలు సంభవిస్తే, 12 మాతృ మరణాలు జరిగాయి. గర్భం దాల్చిన నాటి నుంచి డెలివరీ అయ్యే వరకు సరైన పోషకాహారం, వ్యాయామం, జాగ్రత్తలు పాటించడం, డెలివరీ అనంతరం గంటలోపు బిడ్డకు పాలు ఇవ్వడం వల్ల మరణాలను తగ్గించవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

**ఆరు నెలల్లోపు..**

అప్పుడే పుట్టిన శిశువు మొదలుకొని ఆరు నెలల పాటు బిడ్డకు తల్లి పాలు మాత్రమే తాగించాలి. తల్లిపాలు తేలికగా అరగడంతో పాటు పిల్లలకు భవిష్యత్‌లో శ్వాసకోశ వ్యాధులు, అలర్జీలు, ఆస్తమా, చర్మవ్యాధుల నుంచి రక్షిస్తాయి. అలాగే బిడ్డ మానసిక, శారీరక వికాసానికి అవసరమైన పోషకాలు ఇస్తాయి. ప్రతీరోజు 8నుంచి 10సార్లు పాలు ఇవ్వవచ్చు. ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఆహారం పెట్టవద్దని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. గర్భిణిగా ఉన్నప్పటి నుంచే బిడ్డ ఎదుగుదలకు పండ్లు, కూరగాయలు, పోషకాహారం, గుడ్లు, చేపలు మోతాదులో తీసుకోవాల్సి ఉంటుంది. తద్వారా తల్లిబిడ్డ ఆరోగ్యం అన్ని విధాలా బాగుంటుంది. బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు తాగించాలి. కాన్పు కాగానే వచ్చే మొదటి చిక్కని, పసుపురంగులో ఉండే తల్లిపాలను తగించడం ద్వారా బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.

**ప్రయోజనాలు..**

తల్లిపాలు తాగడం వల్ల పిల్లలకు అంటు వ్యాధులు ప్రబలవు. రక్తహీనత బారిన పడకుండా శిశువు ఆరోగ్యంగా ఉండి పెరుగుదల ఉంటుంది. తల్లులు పిల్లలకు పాలు ఇవ్వడం వల్ల డెలివరీ తర్వాత రక్తస్రావ ప్రమాదం తగ్గుతుంది. ఆరోగ్యంగా ఉండడంతో పాటు లావు కాకుండా పూర్వ బరువును తిరిగి పొందుతారు. తల్లిబిడ్డల మధ్య ఆప్యాయత పెరుగుతుంది. జ్వరాలు వచ్చిన, టీకాలు వేసిన సమయంలోనూ పాలు ఇవ్వవచ్చు.

**తల్లులు అవగాహన పెంచుకోవాలి**



తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్నాం. తల్లులు పాలు ఇవ్వడం ద్వారా పిల్లలు అనేక ప్రయోజనాలు పొందుతారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 6 నెలల వరకు తల్లిపాలను తప్పకుండా ప్రతీరోజు 8 నుంచి 10 సార్లు ఇవ్వవచ్చు. తల్లిపాలను మాత్రమే ఇవ్వడం ద్వారా తల్లి, బిడ్డ ఎలాంటి వ్యాధుల బారిన పడకుండా ఉంటారు. ఆరు నెలల వరకు పిల్లలకు ఎలాంటి ఆహారపదార్థలు పెట్టకుండా పాలు మాత్రమే పట్టించాలి.

**- కళావతిబాయి, డీఎంహెచ్‌ఓ**

# పారిశుద్ధ్యం అస్తవ్యస్తం





పెద్దకిష్టాపురంలోరహదారి పక్కన డ్రైయినేజీలో పడిఉన్న చెట్ల కొమ్మలు, రహదారి పక్కన చెత్తకుప్పలు

- విజృంభిస్తున్న విషజ్వరాలు

**గార్ల:** మండలంలోని పెద్దకిష్టాపురం పంచాయతీలో పారిశుద్ధ్యం లోపించడంతో ప్రజలు విషజ్వరాల బారిన పడి ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత పంచాయతీ అధికారులు మాత్రం పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం వహిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ కార్యదర్శి పంచాయతీలో పారిశుద్ధ్య పనులు చేపించి, విషజ్వరాలను అరికట్టేందుకు వైద్యశిబిరాలు ఏర్పాటు చేయించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

### డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు

**మహబూబాబాద్ రూరల్:** జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. అదేవిధంగా మైనర్ డ్రైవింగ్, రాష్ డ్రైవింగ్‌పై నిఘా పెట్టి ప్రజలకు డ్రంకెన్ డ్రైవ్ వల్ల జరిగే నష్టాలపై అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనం నడపడం వల్ల తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలు కూడా ప్రమాదంలో పడేసినవారవుతారని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, తల్లిదండ్రులు తమ పిల్లలపైన నిఘా ఉంచాలని సూచించారు. ప్రతీ ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ ధరించాలన్నారు. ప్రతి ఒక్కరూ వాహనానికి సంబంధించిన పత్రాలు వెంబడి ఉంచుకోవాలని సూచించారు.

# గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



ఖానాపురంలో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

**తొర్రూరు రూరల్:** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఖానాపురం, చెర్లపాలెం, ఎస్‌వీకే తండాల్లో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతీ గ్రామం, గిరిజన తండాలు, హరిజన కాలనీల్లో సీసీరోడ్లు, కమ్యూనిటీ హాల్స్ వంటి అభివృద్ధి పనులను చేపట్టి ఆదర్శవంతమైన గ్రామాలు, తండాలుగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం గ్రామాలు, తండాలు, హరిజన కాలనీలను నిర్లక్ష్యంగా వదిలేయడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన అతి తక్కువ సమయంలోనే అనేక సంక్షేమ పథకాలతోపాటు కోట్లాది నిధులతో అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు అనుమాండ్ల తిరుపతిరెడ్డి, నిరంజన్‌రెడ్డి, హరిప్రసాద్‌రావు, హమ్యానాయక్, పెదగాని సోమయ్య, నరేందర్‌రెడ్డి, వెంకటనారాయణగౌడ్, నెహ్రూనాయక్, సుంచు సంతోష్, మేకల కుమార్, మల్లేశంగౌడ్, ప్రసాద్‌రెడ్డి, మహేందర్, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

**పెద్దవంగరలో..**

**పెద్దవంగర:** సీఎం రేవంత్‌రెడ్డి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని రామచంద్రు తండాలో గ్రామ పంచాయతీ భవన ప్రహరీ, మండల కేంద్రంలోని పల్లె దవాఖాన పరిధిలో సీసీ ప్లాట్‌ఫాం పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ స్వరాజ్యం దిశగా కృషి చేస్తుందన్నారు. పాలకుర్తి నియోజకవర్గ ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముద్దసాని సురేష్, నాయకులు కేతిరెడ్డి నిరంజన్ రెడ్డి, జాటోతు నెహ్రూనాయక్, తొర్రూరు పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, మాజీ ఎంపీపీ సబిత, రాజు, శ్యాం, సీతారాం నాయక్, శ్రీనివాస్, మురళి, సతీష్, జాటోతు వెంకన్న, హరికృష్ణ, సైదులు, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

**స్థల కేటాయింపునకు కృషి**

**తొర్రూరు:** తొర్రూరు ఏరియా ఆస్పత్రికి స్థలం కేటాయించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. ఆస్పత్రి సూపరిటెండెంట్‌గా నియామకమైన సుగుణాకర్‌రాజు, ఇతర వైద్యులు ఆదివారం డివిజన్ కేంద్రంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసారు. ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. అనంతరం 100 పడకల ఆస్పత్రికి భవన నిర్మాణం, సిబ్బంది కేటాయింపు, మౌలిక సౌకర్యాల కల్పనపై ఎమ్మెల్యేతో చర్చించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, ఆర్ఎంఓ రమేష్, వైద్యులు శంకర్, విజయ్ పాల్గొన్నారు.

# తీరుమారేనా..?

- డాక్యుమెంట్ రైటర్ల చేతుల్లో సబ్‌రిజిస్ట్రార్లు
- సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఏసీబీ నజర్





**కాజీపేట అర్బన్ :** రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపుల శాఖను ప్రక్షాళన చేసేందుకు జూలై 20న అటెండర్‌స్థాయి నుంచి జూనియర్, సీనియర్ అసిస్టెంట్ల బదిలీల ఉత్తర్వులు జారీ చేసింది. కార్యాలయాల్లో మార్పు తీసుకొచ్చేందుకు జూలై 31న సబ్ రిజిస్ట్రార్లతోపాటు జిల్లా రిజిస్ట్రార్లకు స్థానచలనం కల్పించింది. కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 13 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జిల్లా రిజిస్ట్రార్ నుంచి అటెండర్‌స్థాయి వరకు బదిలీ అయ్యారు. దీంతో నూతన సిబ్బందితో రిజిస్ట్రేషన్ కార్యాలయాల తీరు మారేనా, దళారులు బెడద తప్పేనా అని భూక్రయ విక్రదారులు, పేద, మధ్య తరగతి ప్రజలు చర్చించుకుంటున్నారు.

**13 కార్యాలయాలు.. 600 మంది డాక్యుమెంట్ రైటర్లు**

మా చేతుల్లోనే సబ్ రిజిస్ట్రార్లు ఉన్నారంటూ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో డాక్యుమెంట్ రైటర్లు తమ హవా కొనసాగిస్తున్నారు. 13 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సుమారు 600 మందికి డాక్యుమెంట్ రైటర్లుగా కొనసాగుతున్నారు. వరంగల్ ఆర్వోలోనే సుమారు 110 మంది ఉన్నారు. ఏకంగా సబ్ రిజిస్ట్రార్ పోడియం వద్దకు వెళ్లి తమ హుందాతనాన్ని భూక్రయవిక్రయదారులకు చూపుతూ అందిన కాడికి దండుకుంటున్నారు. భూక్రయవిక్రయదారులు నేరుగా వెళితే పనికాదు.. డబ్బులు చెల్లిస్తే చాలు మేం చేస్తామని చెబుతున్నారు.

**నేడు విధుల్లో చేరిక..**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో బదిలీ అయిన సబ్ రిజిస్ట్రార్లు సోమవారం తమకు కేటాయించిన కార్యాలయాల్లో చేరనున్నారు. కాగా, డాక్యుమెంట్ రైటర్లను నమ్ముకుని మోసపోకుండా సామాన్యులకు అందుబాటులో ఉండాలని ఉమ్మడి వరంగల్ జిల్లాలోని భూక్రయవిక్రయదారులు కోరుతున్నారు.

**ఏసీబీ నజర్..**

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఏసీబీ ప్రత్యేక నజర్ పెట్టింది. 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇప్పటికే ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లపై దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంది. తర్వాత ఎవరు అనే చర్చ కొనసాగుతున్న తరుణంలో బదిలీల ఉత్తర్వులు వచ్చాయి. దీంతో సబ్ రిజిస్ట్రార్లు కాస్త ఉపశమనం పొందారనే టాక్ వినిపిస్తోంది. డాక్యుమెంట్ రైటర్లను నమ్ముకుని మార్చి నెలలో మహబూబాబాద్‌లో తస్లీమా, జూలైలో పరకాల సబ్‌రిజిస్ట్రార్ సునీత ఏసీబీకి దొరికారు. ఎలాంటి గుర్తింపులేని వారు డాక్యుమెంట్ రైటర్లుగా చెలామణి అవుతూ సబ్‌రిజిస్ట్రార్లను ఏసీబీ వలలో చిక్కిస్తున్నారు.

### టీటీసీ థియరీ పరీక్షలు

**విద్యారణ్యపురి:** టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోర్సు (టీటీసీ) థియరీ పరీక్షలు ఆదివారం హనుమకొండలో నిర్వహించారు. ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లో డ్రాయింగ్ పరీక్షలు, లష్కర్‌బజార్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ పరీక్షలు నిర్వహించారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంటవరకు, మధ్యాహ్నం 2 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు, మధ్యాహ్నం 3–30 గంటల నుంచి సాయంత్రం 4–30 గంటలవరకు ఆయా పరీక్షలు నిర్వహించినట్లు డీఈఓ ఎండీ అబ్దుల్‌హై, ఏసీజీఈ భువనేశ్వరి తెలిపారు. పరీక్షలకు 402 మంది అభ్యర్థులు హాజరయ్యారని వారు పేర్కొన్నారు.

### 8 నుంచి ఎంసీఏ పరీక్షలు

**కేయూ క్యాంపస్:** కాకతీయ యూనివర్సిటీ ఎంసీఏ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 8 నుంచి నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి బి.నాగరాజు తెలిపారు. 8న మొదటి పేపర్, 13న రెండో పేపర్, 17న మూడో పేపర్, 20న నాలుగో పేపర్, 22న ఐదో పేపర్ పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. ఆయా తేదీల్లో పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుగుతాయని వారు తెలిపారు.

# రైల్వే ఎన్నికల్లో గెలుపు మాదే..

- రైల్వే సంఘ్ జేజీఎస్ భరణిభానుప్రసాద్



**కాజీపేట రూరల్ :** రైల్వేలో త్వరలో ప్రతిష్టాత్మకంగా జరిగే 'వన్ ఇండస్ట్రీ వన్ యూనియన్' ఎన్నికల్లో రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ విజయం సాధిస్తుందని దక్షిణ మధ్యరైల్వే ఎంప్లాయిస్ సంఘ్ జోన్ జాయింట్ జనరల్ సెక్రటరీ భరణిభానుప్రసాద్ ఆశాభావం వ్యక్తం చేశారు. కాజీపేట రైల్వే సంఘ్ కార్యాలయంలో ఆదివారం కాజీపేట అన్ని బ్రాంచీల ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దక్షిణ మధ్య రైల్వేలో కార్మికుల సమస్యల పరిష్కారానికి సంఘ్ అండగా ఉంటుందన్నారు. 8వ పే కమిషన్ ఏర్పాటు, కార్మికులకు పాత పెన్షన్ స్కీం అమలు, 18 నెలల పెండింగ్ డీఏ చెల్లింపు, రైల్వేలో ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రైల్వే సంఘ్ సికింద్రాబాద్ డివిజన్ ప్రెసిడెంట్ కొత్త మురళి మాట్లాడుతూ సంఘ్ జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎం.రాఘవయ్య నేతృత్వంలో కాజీపేటలో యపనియన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టామని, జరగబోయే ఎన్నికల్లో సంఘ్ ముఖ్య భూమిక పోషిస్తుందన్నారు. సంఘ్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ జి.ప్రభురాజ్ మాట్లాడుతూ రైల్వేశాఖలో హెచ్ఓఆర్ఎస్ నామ్స్‌కు విరుద్ధంగా లోకోపైలెట్లతో అధికారులు పనిచేయిస్తుండడంతో పని ఒత్తిడితో వారు మానసిక ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. రైల్వే సంఘ్ డిప్యూటీ డివిజన్ సెక్రటకీ చింత మురళి, సీడబ్ల్యూసీ మెంబర్ ఎస్.వెంకటనారాయణ, కాజీపేట అన్ని బ్రాంచీల సెక్రటరీలు, చైర్మన్లు జగదీశ్వర్‌రావు, మధుసూదన్‌రావు, బల్వీందర్‌సింగ్, బి.మాధవరావు, ముస్తాక్‌హమ్మద్, రమేష్, అభిలాష్, యాకూబ్‌పాషా, దిలీప్ ఉన్నారు.

# 'కమీషన్ల కోసం ఎమ్మెల్యే ఆరాటం'



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

**తొర్రూరు:** నియోజకవర్గ అభివృద్ధిని గాలికి వదిలేసి కేవలం కమీషన్ల కోసమే పాలకుర్తి ఎమ్మెల్యే ఆరాటపడుతున్నారని బీజేపీ నియోజకవర్గ ఇనచార్జ్ లేగా రామ్మోహన్‌రెడ్డి దుయ్యబట్టారు. ఆదివారం డివిజన్ కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్లు అప్పుడు మాజీ మంత్రి దయాకర్‌రావుకు, ఇప్పుడు ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి ఏటీఎంగా మారాయని అన్నారు. రిజర్వాయర్లకు మరిన్ని నిధులు కావాలని సీఎంను కోరడం కేవలం కమీషన్లు దండుకోవడం కోసమేనని ఆరోపించారు. తన సొంత డబ్బులతో 32 కిలోమీటర్లు కాల్వలు తవ్వించానని అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యే అబద్ధాలు చెప్పారని అన్నారు. అవినీతిలో ఎర్రబెల్లికి, యశస్వినికి ఏమీ తేడా లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్, నాయకులు పల్లె కుమార్, బొచ్చు సురేష్, అలిసేరి రవిబాబు, హైండ్ల రాజేష్, గడల శేఖర్, గట్టు రాంబాబు, మంగళపల్లి యాకయ్య, కాగు నవీన్ పాల్గొన్నారు.

# 'దుసపాటి లొద్ది'కి రావొద్దు



వాహనదారులను తిప్పి పంపుతున్న సిబ్బంది

**వాజేడు :** ములుగు జిల్లా వాజేడు మండలం కొంగాల సమీపంలోని దుసపాటి లొద్ది జలపాతానికి పర్యాటకులు రావొద్దని అటవీ శాఖ అధికారులు తెలిపారు. జలపాతానికి వెళ్లకుండా జాతీయ రహదారి నుంచి కొంగాల దారిలో సిబ్బందిని నియమించారు. సందర్శనకు వెళ్తున్న వారిని తిప్పి పంపిస్తున్నారు. జలపాత సందర్శనకు ఎలాంటి అనుమతి, రక్షణ ఏర్పాట్లు లేకపోవడంతో పర్యాటకులను అనుమతించడం లేదు. వీటితో పాటు దూలాపురం సమీపంలోని మాసన్ లొద్ది, అరుణాచలపురం సమీపంలోని గుండం జలపాతాలకు కూడా పర్యాటకులు వెళ్లొద్దని ఇప్పటికే ఆదేశాలు జారీచేశారు.

## సినీ ఫక్కీలో మోసం ..

● ఏటీఎం నుంచి డబ్బులు డ్రా

మహబూబాబాద్ రూరల్ : సినీ ఫక్కీలో మోసం జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు ఏటీఎం నుంచి డబ్బులు డ్రా చేసుకుని పరారయ్యారు. ఈ ఘటన ఆదివారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. జిల్లా కేంద్రానికి చెందిన అధ్యాపకుడు నాయిని కుమారస్వామి మార్వాడీ బజార్‌లోని ఏటీఎం నుంచి రూ.10 వేలు డ్రా చేసుకున్నాడు. అయితే తన ఏటీఎం కార్డును అక్కడే మరిచి ఇంటికి వెళ్లాడు. కొంత సమయం తరువాత తన సెల్ ఫోన్‌కు కొన్ని మెసేజ్‌లు వచ్చాయి. ఆ మెసేజ్‌లు చూడగా రూ.30 వేలు డ్రా అయినట్లు తెలిసింది. దీంతో లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## రేపు వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక

హన్మకొండ: టీజీ ట్రాన్స్‌కో, డిస్కం ఇంటర్ సర్కిల్ వాలీబాల్ టోర్నమెంట్ 2024–25 కోసం ఉమ్మడి వరంగల్ జిల్లా సర్కిల్ జట్టు క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు స్పోర్ట్స్ కౌన్సిల్ చైర్మన్, హనుమకొండ ఎస్‌ఈ కె.వెంకటరమణ తెలిపారు. ఈ నెల 6న ఉదయం 10 గంటలకు హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఎంపికలు ఉంటాయని, ఇందులో ఎంపికైన అయిన వారు ఆదిలాబాద్ ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఈనెల 16 నుంచి జరిగే టీజీ ట్రాన్స్‌కో–డిస్కం పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన విద్యుత్ ఉద్యోగులైన వాలీబాల్ క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనాలని సూచించారు.

## 160 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

చిల్పూరు: మండలంలోని రాజవరం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన మోటం దేవేందర్ 160 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచారనే సమాచారం మేరకు అధికారులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం దేవేందర్‌పై కేసు నమోదు చేసి బియ్యాన్ని గోదాం తరలించినట్లు టాస్క్ ఫోర్స్ సీఐ శ్రీధర్ తెలిపారు.

## గంజాయి మత్తులో యువకుల వీరంగం

ఖిలా వరంగల్: గంజాయి మత్తులో యువకులు వీరంగం సృష్టించారు. కరీమాబాద్ ఉర్సు గుట్ట రోడ్డులోని బీరన్న గుడి ఆవరణలో ఆదివారం పట్టపగలే గంజాయి మత్తులో యువకులు రెండు గ్రూపులుగా వీడి దాడులు చేసుకున్నట్లు తెలిసింది. ఈదాడిలో పలువురికి స్వల్ప గాయాలైనట్లు సమాచారం. స్థానికులు సమాచారం మేరకు మిల్స్‌కాలనీ పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్నారు. పోలీసుల రాకను చూసిన యువకులు పరుగులు పెట్టారు. మరికొంత మంది యువకులు పోలీసులకు చిక్కగా వారిని స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నట్లు సమాచారం.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


తిరుమలేశ్ (ఫైల్)

నర్మెట: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం మండలంలోని హన్మంతాపూర్‌లో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. హన్మంతాపూర్ దొడ్లగడ్డ తండాకు చెందిన కొర్ర తిరుమలేశ్ (24) తన ద్విచక్రవాహనంపై తండా నుంచి హన్మంతాపూర్ వస్తున్నాడు. ఈ క్రమంలో హన్మంతాపూర్–జనగామ ప్రధాన రహదారిపై నిలిచి ఉన్న ట్రాలీ వాహనాన్ని వెనుక నుంచి ఢీకొన్నాడు. తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటపై మృతుడి భార్య సింధు ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై సైనాల నగేశ్ తెలిపారు.



# ఆలోచిస్తూ ముందుకు 'సాగు'

● వరి, మొక్కజొన్న, పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి
● జాగ్రత్తలు తీసుకుంటేనే అధిక దిగుబడులు
● అన్నదాతలకు జేడీఏ ఉషాదయాళ్ సలహాలు, సూచనలు


ఉషాదయాళ్, జేడీఏ


చెన్నారావుపేట: వానాకాలంలో ఆశించిన మేర వర్షాలు పడకపోవడంతో కొందరు రైతులు బావులు, బోర్ల కింద వరి నాట్లు వేశారు. మరి కొందరు వరి నార్లు పోసుకుని వర్షాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఇంకొందరు రైతులు ఇటీవల కురిసిన ముసురుకు నాట్లు వేసుకున్నారు. ఈ క్రమంలో నాట్లు వేయని రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. ఒకవేల వర్షాలు కురిస్తే నాటు వేయడానికి ఆలస్యమవుతుంది. ఈ నేపథ్యంలో నేరుగా వెదజల్లే పద్ధతిలో వరి పంట సాగు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉషాదయాళ్ పేర్కొన్నారు. వరితోపాటు ఆరుతడి పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంటలకు ఆశిస్తున్న తెగుళ్లు, పురుగుల నివారణపై అన్నదాతలకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

**వరి..**

వర్షాలు ఆలస్యంగా కురిస్తే దీర్ఘకాలిక వరి సాగు చేపట్టాలి. నాటు వేసుకోవడం ఆలస్యమైన ప్రాంతాల్లో 50 రోజుల వయసు ఉన్న నారు ఆకు చివరను తుంచి కుదురుకు ఐదు నుంచి ఆరు మొక్కల చొప్పున నాటు వేసుకోవాలి.

- ఇప్పటి వరకు నారు పోయని రైతులు వర్షాలను సద్వినియోగం చేసుకుని పొలాలను దమ్ము చేసి వరి పంటను నేరుగా విత్తుకోవడం వల్ల సమయం, పెట్టుబడి ఆదా చేసుకోవచ్చు. 25, 21 రోజుల వయసు ఉన్న మధ్య కాలిక, స్వల్ప కాలిక వరి రకాలను నారు పెట్టుకోవాలి.
- వరి నాట్లు వేసుకునే వారం రోజుల ముందు ఎకరాకు సరిపోయే నారు మడికి 800 గ్రాముల కార్బోప్యూరాన్3 జీ గుళికలను ఇసుకలో కలిపి చల్లాలి. దీంతో పొలంలో పంటను 15 నుంచి 20 రోజుల వరకు కొన్ని రకాల పురుగుల నుంచి కాపాడుకోవచ్చు. నారు పెట్టిన తర్వాత ప్రతి రెండు మీటర్లకు కాలిబాటలను తీయడం వల్ల గాలి, వెలుతురు ప్రసరిస్తుంది. తద్వారా సుడిదోమ ఉధృతిని నివారించొచ్చు. అదే విధంగా రైతులు ఎరువులు, పురుగు మందులు పంటకు అందించడానికి సులువుగా ఉంటుంది. ముందస్తు చర్య నివారణలో భాగంగా ఎకరానికి 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను నాటిన 10 నుంచి 15 రోజుల మధ్య వేసుకోవడం వల్ల కాండం తొలిచే పురుగు, ఉల్లి కోడ్‌ను నివారించుకోవచ్చు. వరి సాగు చేసే రైతులు గట్లను శుభ్రంగా ఉంచుకోవాలి. లేనిపక్షంలో గట్ల మీద ఉండే కలుపు మొక్కలపై అగ్గి తెగులు నివసించి వరి పంటను ఆశిస్తుంది.


నాటు కోసం సిద్ధంగా ఉన్న వరి నారు




**పత్తి..**

ప్రస్తుతం కురిసిన వర్షాలను ఉపయోగించుకుని వర్షాధార పత్తి పంటపై మొదటి, రెండో దఫాలతో పాటు నత్రజని, పొటాషియం ఇచ్చే ఎరువులను 20, 40 రోజులలో అందించాలి. ప్రస్తుతం కురిసిన అధిక వర్షాలతో పత్తిలో వడలు తెగులు ఆశిస్తుంది. నివారణకు వడలు తెగులు సోకిన మొక్కల మొదళ్లు తడిచేలా 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును లీటర్ నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు మొక్కల మొదళ్ల చుట్టూ పోయాలి. అలాగే, పంట త్వరగా కోలుకోవడానికి నీటిలో కరిగే ఎరువులు మల్టీ కే (13:0:45 లేదా 10 గ్రాములు) యూరియా లీటర్ నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పోషకాలను పంటపై పిచికారీ చేయాలి. గులాబీ రంగు పురుగు ఉధృతి తెలుసుకోవడానికి లింగాకర్షక బుట్టలను ఎకరాకు 8–10 చొప్పున ఏర్పాటు చేసుకోవాలి. అధిక వర్షాల మూలంగా పచ్చదోమ బాగా ఉధృతమయ్యే అవకాశం ఉంది. 5 శాతం వేప నూనె, 2 మి.లీ ఫిప్రోనిల్ లేదా ఎసిటామిప్రిడ్ 0.2 ప్రతి లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. రసం పీల్చే పురుగు నివారణకు మెనోక్రోటోఫాస్ 1:4 నిష్పత్తి నీటిలో కలిపి 20 రోజులలో, ఇమిడాక్లోప్రిడ్ 1:20 నీటిలో కలిపి 40, 60 రోజుల వయసులో మొక్కలకు బ్రష్ సాయంతో కాండానికి పూయాలి. ఇలా చేయడం వల్ల రసం పీల్చే పురుగు ఉధృతి నుంచి పంటను రక్షించుకోవచ్చు.

**మొక్కజొన్న**


మొక్కజొన్న పంట

అధిక వర్షాలతో మొక్కజొన్న పసుపు రంగుకు మారుతుంది. నీటిని కాలువల ద్వారా బయటకు తీసేయాలి. మొక్కజొన్న శాఖీయ దశలో ఎక్కువగా నీటిని, ప్రత్యుత్పత్తి దశలో నీటి ఎద్దడిని తట్టకోలేదు. పంటను బోదలు, కాల్వల పద్ధతిలో సాగు చేసుకోవాలి. ముందు వేసుకున్న వర్షాధార మొక్కజొన్న పంటలో ఆఖరి అంతర కృషి తర్వాత గొడ్డుచాలు వేసుకుంటే తేమ సంరక్షించబడి పంటకు ఎక్కువ కాలం తేమ లభిస్తుంది. రెండో దఫా1/3 వంతుపై పాటు నత్రజని మోకాలు ఎత్తు దశలో తేమ ఉన్నప్పుడు అందించాలి. మొక్కజొన్న పంటలో అక్కడక్కడ కత్తెర పురుగు ఆశిస్తోంది. నివారణకు 0.4 మి.లీ క్లోరంట్రానిలిప్రోల్ లేదా 0.5 మి.లీ స్పైనటోరం మందును లీటర్ నీటిలో కలిపి ఆకుల సుడుల లోపల తడిచేలా పిచికారీ చేయాలి. మోకాలు ఎత్తు దశలో ఉన్న పైరులో కిలో సున్నం, 9కిలోల ఇసుకను కలిపి సుడుల్లో వేసి కత్తెర పురుగును నివారించుకోవాలి.

**కంది..**

ప్రస్తుతం కురిసిన వర్షాలతో కంది పంటలో ఇనుప దాతులోపం ఆశించేందుకు అనుకూలం. దీని నివారణకు పొలం నుంచి మురుగునీటిని తీసివేసి 2–5 గ్రాముల అన్న బేదిలో పాటు గ్రాము నిమ్మ ఉప్పు మిశ్రమాన్ని లీటర్ నీటిలో కలిపి ఐదు రోజుల వ్యవధిలో రెండు సార్లు వర్షం తగ్గిన తర్వాత పిచికారీ చేయాలి.

**విషపు ఎర తయారీ విధానం..**

ఎకరానికి 10 కిలోల తౌడు, 2 కిలోల బెల్లం తీసుకుని బెల్లాన్ని 2–3 లీటర్ల నీటిలో కరిగించిన తర్వాత తౌడులో కలిపి మిశ్రమాన్ని 24 గంటలు పులియనియ్యాలి. వేసే అరగంట ముందు ఈ మిశ్రమాన్ని 100 గ్రాముల థయోడికార్బ్(లార్విన్) కలిపి మొక్క సుడిలో వేస్తే సమర్థవంతగా కత్తెర పురుగును అరికట్టొచ్చు. కత్తెర పురుగు నివారణకు లింగాకర్షక బుట్టలను 8–10 చొప్పున ఎకరాకు ఏర్పాటు చేసుకోవాలి.

## శాశ్వత పనులకు ప్రణాళిక రూపొందించాలి


మాట్లాడుతున్న మంత్రి సీతక్క


హాజరైన అధికారులు

● వనదేవతల గొప్పతనం భవిష్యత్ తరాలకు తెలపాలి
● రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మేడారంలో శాశ్వత అభివృద్ధి పనుల అంచనా ప్రణాళికలను సిద్ధం చేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అధికారులను ఆదేశించారు. ఆదివారం మేడారంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో ఫిబ్రవరిలో జరిగిన మేడారం జాతర ఖర్చులు, అభివృద్ధి కార్యక్రమాలపై కలెక్టర్ దివాకర టీఎస్, ఐటీడీఏ పీఓ చిత్రమిశ్రా, అదనపు కలెక్టర్ శ్రీజ, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మహేందర్‌జీ, డీఎఫ్‌ఓ రాహుల్ కిషన్ జాదవ్, ఆర్డీఓ సత్యా పాల్‌రెడ్డితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో క్యూలైన్స్‌పై షెడ్స్ నిర్మాణం చేపట్టాలని, గిరిజన పూజారుల నుంచి అభ్యంతరాలు తలెత్తితే వారికి అర్థమయ్యేలా పీపీటీల ద్వారా వివరాలు ప్రదర్శించాలని తెలిపారు. జంపన్న వాగు పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేయాలని, వాగు పరివాహక ప్రాంతం చుట్టూ మొక్కల పెంపకం, పార్కులు, హాట్స్ ఏర్పాట్లకు సంబంధించి సలహాలు అందించాలని తెలిపారు. నేటి నుంచి 9వ తేదీ వరకు ఐదు రోజులు నిర్వహించనున్న స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మంత్రి సీతక్క ఆదేశాల ప్రకారం జిల్లా యంత్రాంగం కలిసికట్టుగా మేడారం జాతరను విజయవంతం చేసిందన్నారు. సమావేశంలో విద్యుత్ శాఖ ఎస్‌ఈ మల్సూర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్సీ మల్లేశం, ఆర్అండ్‌బీ ఈఈ వెంకటేశ్, పీఆర్ ఈఈ అజయ్ కుమార్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ వీరభద్రం, డీఎస్పీ రవీందర్, దేవాదాయశాఖ ఈఓ రాజేంద్రం, డీఎంహెచ్‌ఓ అప్పయ్య, జిల్లా పర్యాటక శాఖ అధికారి సూర్య కిరణ్, తహసీల్దార్ రవీందర్, అధికారులు పాల్గొన్నారు.

## మిల్స్‌కాలనీ సీఐ వేధిస్తున్నాడు

● కాపాడాలని సీపీకి బాధితుడి వినతి
● ఆరోపణలు అవాస్తవం : సీఐ మల్లయ్య


ప్రెస్‌మీట్‌లో బాధితుడు గొల్లన రవి, కుటుంబ సభ్యులు

కాశిబుగ్గ: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి.మల్లయ్య తనను చిత్రహింసలకు గురి చేయడమే కాకుండా బట్టలు ఊడదీసి మొద్దుకేసి కొట్టాడని కాశిబుగ్గకు చెందిన గొల్లన రవి కన్నీటిపర్యంతమయ్యాడు. ఆదివారం తన కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వరంగల్ చింతల్ ప్రాంతంలో 444/ఏ సర్వేనంబర్‌లో 237 గజాల స్థలం కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకొని ఇంటి నంబర్ సైతం తీసుకున్నానని చెప్పాడు. ఆ స్థలం వేరే వారిదని ఫిర్యాదు వచ్చిందంటూ తనను పోలీసుస్టేషన్‌కు పిలిపించగా సదరు వ్యక్తితో మాట్లాడి సెటిల్ చేసుకున్నట్లు తెలిపారు. అయినప్పటికీ సీఐ తనను పిలిచి తెల్లబట్టలు వేసుకున్నావు.. బొట్టు పెట్టుకున్నావు.. అంటూ విపరీతంగా కొట్టడమే కాకుండా రోజూ పిలిచి రెండు లక్షలు ఇస్తావా లేదా అంటూ వేధిస్తున్నాడని ఆరోపించారు. సీఐ టార్చర్‌తో మా కుటుంబం అంతా ఆత్మహత్య చేసుకుంటామని, న్యాయం చేయాలని సీపీని వేడుకున్నారు. ఇదిలా ఉండగా.. తన భర్తను స్టేషన్‌కు పిలిపించగా.. ఇంటికి రాకపోవడంతో వెళ్లి అడిగితే మావద్ద లేడంటూ కానిస్టేబుల్ సమాధానం ఇవ్వడమే కాకుండా ఇష్టారాజ్యంగా మాట్లాడారని రవి భార్య తెలిపారు. ఈవిషయంపై మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్యను వివరణ కోరగా గొల్లన రవి ఆరోపణలు అవాస్తమని, ఆయన పెద్ద ఎత్తున భూ కబ్జాలకు పాల్పడుతున్నాడని తెలిపారు.

## పెళ్లి కావడం లేదని.. మనస్తాపం

● యువకుడి ఆత్మహత్య
● వర్ధన్నపేటలో విషాదం


మహేశ్(ఫైల్)

వర్ధన్నపేట : పెళ్లి కావడం లేదనే మనస్తాపంతో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన వర్ధన్నపేటలో చోటచేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన చెన్నబోయిన యాకమ్మకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉంది. వీరిలో పెద్ద కుమారుడు, కూతురుకు వివాహం చేసింది. చిన్న కుమారుడు మహేశ్(33) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. యాకమ్మ కూలీ చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఈ క్రమంలో మహేశ్‌కు ఎన్ని పెళ్లి సంబంధాలు చూసినా కుదరడం లేదు. దీంతో తన స్నేహితులకు పెళ్లిళ్లు అయ్యాయని, తనకు మాత్రం కావడం లేదని మనోవేదనకు గురయ్యేవాడు. ఈక్రమంలో శనివారం రాత్రి తన ఇంటి పక్కన ఉన్న ఉప్పలయ్య ఇంటి పిల్లర్‌కు ఉరేసుకున్నాడు. దీనిని గమనించిన తల్లి యాకమ్మ కేకలు వేయగా ఇరుగుపొరుగు వచ్చి చూడగా మహేశ్ అప్పటికే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తల్లి యాకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

**మద్యానికి బానిసై ధర్మారంలో వ్యక్తి..**


గోపి(ఫైల్)

గీసుకొండ: మద్యానికి బానిసై గీసుకొండ మండలం ధర్మారం గ్రామానికి చెందిన కరెడ్ల గోపి(40) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ బాబూలాల్ కథనం ప్రకారం.. గోపి రోజూ కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. ఈక్రమంలో శనివారం రాత్రి కూడా మద్యానికి డబ్బులు ఇవ్వలేదని భార్య లక్ష్మి, కూతురిని కొట్టాడు. దీంతో వారు తమ బంధువుల ఇంటికెళ్లి నిద్రించారు. ఆదివారం ఉదయం కడారి రమేశ్ అనే వ్యక్తి మృతుడి భార్య లక్ష్మికి ఫోన్ చేసి నీ భర్త గోపి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. దీంతో లక్ష్మి వెళ్లి చూడగా గోపి మృతి చెంది కనిపించాడు. ఈ ఘటనపై మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ బాబూలాల్ తెలిపారు.


## ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం..

● ముగ్గురిపై చీటింగ్ కేసు ● శనిగపురంలో ఘటన

మహబూబాబాద్ రూరల్ : విద్యుత్ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసిన ఘటనలో ముగ్గురు వ్యక్తులపై చీటింగ్ కేసు నమోదు చేశామని మహబూబాబాద్ రూరల్ ఎస్సై వి.దీపికారెడ్డి ఆదివారం తెలిపారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి శనిగపురం గ్రామానికి చెందిన సింగారపు అఖిల్, గుగులోత్ వెంకన్న, బొమ్మరాజు రాము వద్ద మహబూబాబాద్ కంకర బోర్డు ప్రాంతానికి చెందిన జాటోత్ రవికుమార్, భూపాలపల్లికి చెందిన సహోదర్ రెడ్డి, నాగేశ్వరరావు.. విద్యుత్ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి రూ.37 లక్షలు తీసుకున్నారు. 2021, 22, 23 మూడేళ్ల కాలంలో దశలవారీగా సదరు యువకుల వద్ద నుంచి డబ్బులు తీసుకుని విద్యుత్ శాఖలో ఉద్యోగాలు వచ్చాయని చెప్పి నకిలీ ఆర్డర్ కాపీలు ఇచ్చారు. ఈ ఆర్డర్ కాపీలను తీసుకున్న అఖిల్, వెంకన్న, రాము.. సంబంధిత ఉద్యోగ ప్రదేశాలకు వెళ్తే అవి ఉద్యోగ నియామకాలకు సంబంధించినవి కాదని తేలింది. దీంతో తమను మోసం చేశారని, ఇందుకు బాధ్యులపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరుతూ మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై వి.దీపికారెడ్డి తెలిపారు.

## భారీ కొండ చిలువ సంచారం..

● మల్లక్‌పేట రెసిడెన్షియల్ సమీపంలో రోడ్డుపై ప్రత్యక్షం



హన్మకొండ (పరకాల): పరకాల శివారు మల్లక్‌పేట సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సమీపంలో భారీ కొండ చిలువ రోడ్డుపై నుంచి వెళ్లింది. దీనిని చూసిన వాహనదారులు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. శుక్రవారం రాత్రి 9గంటల సమయంలో సుమారు 5 మీటర్ల పొడవుతో కనిపించిన కొండ చిలువ రోడ్డు దాటేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో కొందరు వాహనదారులు భయభ్రాంతులకు గురికాగా, మరికొందరు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. రోడ్డు దాటి పంటపొలాల వైపునకు వెళ్లిందని ప్రత్యక్షులు తెలిపారు. దాదాపు 20 నిమిషాల పాటు వాహనాల రాకపోకలు నిలిచినట్లు రంజిత్ అనే వాహనదారుడు తెలిపారు. మల్లక్‌పేట సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఆవరణలో శిథిల భవనం వద్ద గత నెల 14న కొండ చిలువ పిల్లలు కనిపించిన మరికొద్ది రోజులకే భారీ కొండ చిలువ సంచరిస్తున్నట్లు తెలియడంతో విద్యార్థినులు ఆందోళనకు గురయ్యారు. రెసిడెన్షియల్ సమీపంలోనే కొండచిలువలు సంచరించడం విద్యార్థినుల తల్లిదండ్రులు కూడా భయాందోళనకు గురవుతున్నారు. ఆదివారం హాస్టల్ వద్దకు చేరుకున్న తల్లిదండ్రులు.. కొందరు రాత్రి వేళలో బయటకు రావొద్దని తమ పిల్లలకు సూచించడం కనిపించింది. అటవీ శాఖ అధికారులు కొండ చిలువను పట్టుకోవాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## చిన్నారికి అరుదైన వ్యాధి

● ప్రాణాపాయ స్థితిలో 10 నెలల పాప
● రూ.17 కోట్ల సూది మందు ఇస్తేనే..
● కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న తల్లిదండ్రులు
● దాతలు, ప్రభుత్వం స్పందించాలని వేడుకోలు


దాతల సాయం కోసం వేడుకుంటున్న చిన్నారి తల్లిదండ్రులు


వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైష్ణవి




జనగామ: చిన్నారికి పెద్ద జబ్బు వచ్చింది. రూ.17 కోట్ల విలువైన సూది మందు ఇస్తేనే ప్రాణాలు దక్కుతాయి. దాతలు, ప్రభుత్వం ముందుకు వస్తేనే ఊపిరి నిలుస్తుంది. తమ బిడ్డకు ఆయుష్షు పోయాలని తల్లిదండ్రులు రెండు చేతులెత్తి మొక్కుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. జనగామ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన గడిపె ప్రశాంత్–సంపూర్ణ దంపతులకు 10 నెలల కూతురు వైష్ణవి ఉంది. ఆమె వెన్నెముక కండరాల క్షీణత వ్యాధి(స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ/ఎస్ఎంఏ)తో బాధపడుతోంది. ప్రశాంత్ పట్టణంలోని ఓ కూల్ డ్రింక్ ఏజెన్సీలో నెలకు రూ.12వేల వేతనంతో డెలివరీ బాయ్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. చిన్నారి తరచుగా అనారోగ్యానికి గురికావడంతో స్థానిక వైద్యులను సంప్రదించగా హైదరాబాద్‌కు తీసుకెవెళ్లాలని సూచించారు. వెంటనే హైదరాబాద్‌లోని చిన్నపిల్లల ఆస్పత్రికి తీసుకెళ్లగా డాక్టర్ రమేశ్ కోనంగి నేతృత్వంలో వైష్ణవికి వైద్య పరీక్షలు నిర్వహించి.. లక్షల్లో ఒకరికి ఉండే ఎస్ఎంఏ వ్యాధి ఉన్నట్లు నిర్ధారించారు. జన్యు లోపంతో ఈ వ్యాధిబారిన పడిన వారికి సకాలంలో వైద్యం అందించని ప క్షంలో మొదటి స్టేజీలో రెండేళ్లు, రెండో స్టేజీలో 14 నుంచి 16 ఏళ్ల వరకు మాత్రమే బతికే అవకాశం ఉంది. ప్రస్తుతం వైష్ణవికి మొదటి స్టేజీ ఉన్నట్లు వైద్యులు చెప్పడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

**ఒక్క సూది..రూ.17 కోట్లు**

బిడ్డ బతకాలంటే.. రూ.17 కోట్ల సూదిమందు ఇవ్వాలి. అది కూడా సకాలంలో అమెరికా నుంచి వస్తేనే పాపకు నిండు నూరేళ్ల ఆయుష్షు. నెలకు రూ.12వేలు సంపాదించే ఆ తండ్రి.. బిడ్డ ప్రాణాలు కాపాడుకునేందుకు ఖరీదైన వైద్యం అందించలేని దయనీయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. దాతలు, ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం వరంగల్ ఎంజీఎం ఎమర్జెన్సీ వార్డులో చిన్నారికి వైద్యం అందిస్తున్నారు. పేద కుటుంబాల పిల్లలకు అవసరమైన సమయంలో ఖరీదైన వైద్యం అందించేందుకు, అండగా నిలిచేందుకు ఏర్పాటు చేసిన ఫౌండేషన్‌లో డాక్టర్ రమేశ్ కోనంగి చిన్నారి వైష్ణవి పేరును నమోదు చేయించారు. అయితే, ఇందులో ఇప్పటికే వంద మందికి పైగా సీరియల్‌లో ఉన్నారు. ఇటువంటి వ్యాధితో బాధపడిన వారికి గతంలో ఏపీ, కేరళ ప్రభుత్వాలు ముందుకు వచ్చి కోట్లాది రూపాయలు ఖర్చు చేసి అమెరికా నుంచి సూది మందు తెప్పించాయి. దాతలతోపాటు రాష్ట్ర ప్రభుత్వం సైతం స్పందించి చిన్నారి వైష్ణవికి ఊపిరి పోయాలని తల్లిదండ్రులు, మనసున్న ప్రతిఒక్కరూ కోరుతున్నారు.

దాతలు సంప్రదించాల్సిన నంబర్లు
ఫోన్‌పే నంబర్ :
8247266886 (ప్రశాంత్)
ఫోన్‌పే నంబర్ :
7993420233 (సంపూర్ణ)
బ్యాంకు ఖాతా వివరాలు
ఖాతాదారుడి పేరు : గడిపె ప్రశాంత్
ఖాతా నంబర్ :
50100380965702
ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ :
హెచ్‌డీఎఫ్‌సీ0002352
బ్రాంచ్ : జనగామ
ఖాతా : సేవింగ్స్

## రెగ్యులర్ ఎంఈఓలను నియమించాలి



మాట్లాడుతున్న కటకం రమేశ్

విద్యారణ్యపురి: ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణకు రెగ్యులర్ ఎంఈఓలను నియమించాలని టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేశ్ కోరారు. హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలల్లో పీఎస్ హెచ్ఎం పదోన్నతికి బీఈడీ అర్హత కలిగిన ఎస్జీటీలకు అవకాశం కల్పించేవిధంగా 11, 12 జీఓలను సవరించాలన్నారు. ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలన్నారు. పీఆర్సీ నివేదికను పూర్తిచేసి ఉద్యోగులకు వెంటనే అమలు చేయాలని కోరారు. టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఎంఈఓలను నియమించేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజబాపురావు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌నాయక్, చీఫ్ ప్యాట్రన్ లక్కిరెడ్డి సంజీవరెడ్డి, ఉమ్మడి రాష్ట్రాల కన్వీనర్ డి.విష్ణుమూర్తి, రాష్ట్ర కార్యదర్శులు ఎస్.రఘుకుమార్, సదానందం, రాజేశ్, వరంగల్, ములుగు, భూపాలపల్లి, జనగామ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.కిషన్, కృష్ణమూర్తి, కె.రవీందర్, కుమార్, రాజునాయక్, శ్రీనివాస్, కుమారస్వామి, నర్సింహస్వామి పాల్గొన్నారు.

## రెండు లారీలు ఢీ..

● ఇసుక లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి
● చింతలమోరి వద్ద ఘటన


ఎదురెదురుగా ఢీకొన్న లారీలు

ఏటూరునాగారం: రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఓ డ్రైవర్ మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం రాత్రి ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి సమీపంలోని చింతల మోరి వద్ద 163 జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. మంగపేట మండలం కమలాపురానికి చెందిన లారీలో అదే మండలం మల్లూరుకు చెందిన డ్రైవర్ చీర్ర యాకయ్యగౌడ్(35) చుంచుపల్లి క్వారీలో ఇసుక లోడింగ్ చేసుకుని వరంగల్ వైపునకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో వరంగల్ వైపు నుంచి ఓ మిషన్ తీసుకుని ఛత్తీస్‌గఢ్ వైపునకు వెళ్తున్న లారీ ఎదురుగా ఢీకొంది. ఈ ఘటనలో ఇసుక లారీ డ్రైవర్ యాకయ్యగౌడ్ క్యాబిన్‌లో ఇరుక్కొని అక్కడికక్కడే మృతి చెందాడు. మిషనరీ లారీ డ్రైవర్ జస్టిస్‌సింగ్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న ఎస్సై తాజొద్దీన్ వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కాగా, లారీ డ్రైవర్ యాకయ్యగౌడ్‌కు గతేడాది రజినితో వివాహం జరిగింది. ఈ క్రమంలో యాకయ్యగౌడ్ మృతితో కుటుంబంతోపాటు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## నిప్పు రగిలి ఇల్లు దగ్ధం

● కాలిబూడిదైన వంట సామగ్రి, నగదు


కాలిన నోట్లను చూపుతున్న వృద్ధురాలు

చెన్నారావుపేట: నిప్పు రవ్వ రగిలి పూరిల్లు దగ్ధమైంది. ఈ ఘటన ఆదివారం మండలంలోని జోజిపేట నారాయణ తండాలో చోటు చేసుకుంది. బాధితురాలి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వృద్ధురాలు సంద ఈరవ్వ కూలీ చేసుకుంటూ జీవనం కొనసాగిస్తోంది. ఈ క్రమంలో ఆదివారం తన రేకుల ఇంటిలో వంట పని ముగించుకుంది. అనంతరం ఇంటిలో విద్యుత్ సరఫరా కావడం లేదని, మరమ్మతులు చేయించడానికి ఎవరినైనా తీసుకురావడానికి బయటకు వెళ్లింది. ఈ క్రమంలో కట్టెల పొయ్యిలో మిగిలి ఉన్న నిప్పు రగులుకుని ఇల్లంతా మంటలు వ్యాపించాయి. చుట్టుపక్కల వారు వచ్చి నీటితో మంటలు ఆర్పారు. ఈఘటనలో దుస్తులు, వంట సామగ్రితో సహా రూ. 4500 నగదు దగ్ధమైనట్లు వృద్ధురాలు కన్నీరుమున్నీరైంది. ఇల్లు కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న తనను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంది.